పుష్పవిలాపం

కాకాని కమల



"(స)రోజా సీరియస్. స్టార్ట్ ఇమిడియట్లీ"

–జగన్నాథం.

టెలిగ్రాం చదువు కున్న రవీంద్ర గుండె ఒక్క క్షణం ఆగి తిరిగి రెట్టింపు వేగంతో కొట్టుకో సాగింది.

తుఫానులో చిగురాకులా ఆపాదమస్తకం కంపించి పోయాడు.

ఒక విధమైన ఉద్వేగంలో శరీరం లోని రక్తం వురుకులెత్త సాగింది.

కళ్ళముందంతా నల్లగా చీకటి వలయాలు....

కాళ్ళ కింద నేల జారిపోతున్నట్లు అనిపించి నిస్సత్తువతో ప్రక్కనే వున్న కుర్చీలో జార్లపడ్డాడు.

అతని మెదడంతా సన్నని హోరు.....

పోటెత్తిన సముద్రంలా మనసంతా ఒక విధమైన అలజడి.

"(స) రోజా సీరియస్ స్టార్ట్ ఇమిడియట్లీ."

–జగన్నాథం.

కళ్ళు విప్పార్చుకుని మళ్ళీ ఒక్కసారి చేతిలోని ఎర్రని కాగితాన్ని చదువు కున్నాడు.

"..... ఏమిటి? రోజాకి సీరియస్‌గా వుందా? ఇంత హఠాత్తుగా అంత ముంచుకు వచ్చిన ప్రమాదం ఏమిటి? సరిగ్గా ఇరవై రోజుల క్రితమే కదా మావయ్య గారి వూరు వెళ్ళి వచ్చాడు తను? సరోజ ఆరోగ్యంగా చెలాకీగా వుంది. పదిహేడేళ్ళ పరువంతో మిసమిస లాడి పోతూంది. ఆమెకి నలతగా వున్నట్లు కూడా తనతో కనీస మాటగా నైనా ఎవరూ అనలేదు. ఇంతలోనే అంత ముంచుకు వచ్చిన ప్రమాదం ఏమిటి? మావయ్య ఇంత అర్జంటుగా తనని బయలుదేరి రమ్మని ఎందుకు టెలిగ్రాం ఇచ్చాడు?"

రవీంద్ర భ్రకుటి ముడి పడింది.

అతని మెదడంతా పాముల బుట్టలా తయారయ్యింది.

చిక్కు పడిన దారాల్లా ఆలోచన్లు ఎటూ తెగటంలేదు.

సరిగ్గా వచ్చే వారం నుంచి మెడిసన్ ఆఖరి సంవత్సరపు పరీక్షలు.

వూపిరి తియ్యటానికి కూడా వ్యవధి లేనంత బిజీగా వున్నాడు. కాలు కదపటానికి వీలు లేని పరిస్థితి.

కాని చేతిలో టెలిగ్రాం చూస్తూ వెళ్ళ కుండా మాత్రం ఎలా వుండగలడు?

మామయ్యకి మాత్రం తెలియనిదా తన పరీక్షల సంగతి?

అయినా అర్జంటుగా బయలు దేరి రమ్మని టెలిగ్రాం ఇచ్చాడంటే సరోజ పరిస్థితి ఏదో ప్రమాద కరంగానే వుండి వుండాలి.

ఆ మధ్య ఒకసారి అత్తయ్య కాబోలు అంది.

"రోజా ఈ మధ్య తరచూ కడుపు నొప్పి అంటోందయ్యా, ఒకసారి పరీక్ష చేయించాలి". అని!

బహుశా అదేమన్నా సీరియస్ అయి ఏ "అపెండిసైటిస్" ఆపరేషన్ కైనా దారితియ్య లేదుకదా?........

అసహనంగాముని వేళ్ళతో కణతలు నొక్కుకున్నాడు రవీంద్ర.

ప్రక్కనే వున్న రైటింగ్ టేబిల్ నిండా మెడిసన్ పుస్తకాలు దొంతర్లు దొంతర్లుగా పేరుకుని వున్నాయి. అందులో సగం లైబ్రరీ నుండి పట్టుకొచ్చాడు. త్వరలో రిటన్ చెయ్యాలి.

మరొక ప్రక్క అతను కష్ట పడి ప్రిపేర్ చేసుకున్న నోట్సు తాలూకు కాగితాలు "ట్రేలో" పేపరు వెయిట్ కింద నలుగు తున్నాయి.

పగలూ రాత్రి కూర్చుని చదువుతున్నా సమయం చాలటం లేదు.

ఈ పరిస్థితిలో ప్రయాణం ఏమిటి?

కాని.......

కాని తన రోజాకి .... తన ప్రియాతి ప్రియమైన రోజాకి సీరియస్‌గా వుందని తెలిసి వెళ్ళకుండా మాత్రం వుండగలడా?

అసహనంగా ముని వేళ్ళతో కణతలు రుద్దుకుంటూ ఆలోచన్ల భారంతో నెమ్మదిగా తల ఎత్తాడు రవీంద్ర

ఎదురుగా .... టేబిల్ మీద వున్న పెద్ద ఫోటో కేస్‌పై అతని దృష్టి నిలిచి పోయింది.

లైఫ్ సైజులో రోజా కలర్ ఫోటో విరిసిన గులాబిలా అందంగా చిరునవ్వులు చిందిస్తోంది.

తుమ్మెద రెక్కల్లా రింగులు రింగులు తిరిగి బొద్దుగా వున్న రెండు జడలు .... లేత గులాబి రంగు ఆఫ్ శారీ, నల్ల జాకట్టు, మీనాల్లా సోగలు దేరిన కళ్ళతో కొంటె నవ్వులు చిందిస్తూ రవీంద్ర కేసి చిలిపిగా చూస్తున్నట్లు వుంది ఆ ఫోటో.

రవీంద్ర ఆర్తిగా ఆ ఫోటో ని చేతుల్లోకి తీసుకుని తమకంగా పెదాలకి ఆనించుకున్నాడు

కళ్ళనిండా గిర్రున నీళ్ళు తిరిగాయి.

మనసు చల్లగా ఆర్ద్రం అయ్యింది.

"రోజా! ఏమైంది నీకు?"

తలతిప్పి గడియారం కేసి చూశాడు. సమయం పది గంటలు దాటుతోంది లాస్ట్ బస్ పదిన్నరకి వుంది. ఆ బస్సు కేచ్ చేస్తే తెల్లారకుండా రోజా ముందు వుంటాడు

అంతే!

ఆ ఆలోచన రావటం తోటే గభాల్న కుర్చీలోంచి లేచాడు రవీంద్ర

చిందర వందరగా పడి వున్న పుస్తకాలన్ని తీసి ఒక ప్రక్కకి సర్దాడు. కిటికి రెక్కలు మూశాడు

బ్రీఫ్ కేస్ తెరిచి ఒక జత బట్టలు పెట్టాడు చల్లని నీళ్ళతో మొఖం కడుక్కొని డ్రెస్ అయ్యాడు.

పది నిమిషాల్లో ప్రయాణానికి సిద్ధం అయి గదికి తాళం పెట్టి హడావుడిగా రోడ్డు మీదకి వచ్చాడు.

ఆటో ఎక్కి వేగంగా బస్‌స్టాండ్ చేరుకున్నాడు.

అప్పటికే లాస్ట్ బస్సు స్టేజీలో బయలుదేరటానికి సిద్ధంగా వుంది.

కండక్టర్ని రిక్వస్టు చేసి పరుగున వెళ్ళి టిక్కట్టు తీసుకుని కదులుతున్న బస్సులోకి ఎక్కి కూర్చున్నాడు.

లాస్ట్ బస్సు కావటంతో బస్సు కొంచెం ఖాళీగానే వుంది.

పావు గంటలో బస్సు ఊరి పొలిమేర దాటింది. నగర శివార్లు దాటగానే బస్సులో లైట్లు ఆరిపొయ్యాయి. ప్రయాణీకులు ఒకరొకరే తమ సీట్లలో నిద్రకి వుపక్రమించసాగారు.

చల్లటి గాలి తెరలు తెరలుగా వీస్తోంది.

అమావాశ్య రోజులు కావటంతో బయటంతా చీకటి చిక్కగా వుంది.

కొత్త కారు కొంటే!

ఒక మిత్రుడు, ఉన్న పాతకారును
వదలి కొత్తగా రోల్సురాయిస్ కారు
కొనుక్కున్నాడు నానా ఇబ్బందులూ పడి
మంత్రిగారు వచ్చారు.
మీ కారు ఈ రోజు
ఇవ్వండి అన్నారు కలెక్టరుగారు
ఇవ్వక తప్పదు. లేకపోతే
ఏ కేసులో నో ఇరికిస్తాడు.
ఆ రోజు గడిచింది
మరొక రోజున
మా ఇంట్లో పెళ్ళి
అన్నాడు జిల్లా జడ్జి
ఇవ్వకపోతే ఎలా?
ఇచ్చాడు. ఇంత పసుపూ
కుంకుమా పారాణీ పూసి
ఇచ్చారు పెళ్ళి అయాక
మూడో నాడు
నా మిత్రుడు కారు
అమ్మేస్తానన్నాడు
'మంచి పని చెయ్యి'
అన్నాను. మళ్ళీ పాత కారు
వచ్చింది ఎవరూ దాన్ని
కావాలనటం లేదు.

— ఎం. ఎస్. ఎం.

పుష్పవిలాపం

బస్సులో కూర్చున్నా రవీంద్రకి స్థిమితం చిక్కలేదు. మనసంతా ఒక విధమైన ఉద్వేగం. అలజడి! చల్లగా చలిగాలులు వీస్తున్న వూపిరి ఆడనట్లుగ వుంది.

కడుపంతా మంట రగులుతున్నట్లు ఏదో . అంతు చిక్కని సన్నని వేదన.

మాటి మాటికి టెలిగ్రాంలోని ఎర్రటి అక్షరాలే కళ్ళ ముందు కదులుతున్నాయి.

బస్సులో అంతా నిద్రకి జోగుతున్నా అతనికి మాత్రం రెప్పమూత పడటం లేదు.

కళ్ళు విప్పార్చుకుని అలాగే కిటికీలోంచి బయట చీకట్లోకి చూస్తూ కూర్చున్నాడు.

ఆ నల్లని చీకటిలో సయితం సన్నటి చిరునవ్వుతో రోజా రూపం కనిపిస్తోంది.

అందమైన ఆమె గులాబి వన్నె చెక్కిళ్ళు, ఎర్రని మొగ్గల్లాంటి పెదవులు, సోగలు దేరిన చిలిపి కళ్ళు, తియ్యగా నవ్వుతూ ...."రవీన్ .." అని పిలుస్తున్నట్లే అందమైన అనుభూతి

"లవ్ ఈజ్ టు హార్ట్స్ మ్యూజిక్ ఇన్ వన్‌సాంగ్" అన్నట్లు ఆమె తలపు మాత్రానికే అణువు అణువునా అనిర్వచనీయమైన ఆనందం!

"రో...జా?" రవీంద్ర పెదవులు కలవరింతగా అస్పష్టంగా పలికాయి.

వేదనగా కళ్ళు మూసుకున్నాడు.

* * * *

జగన్నాథం రవీంద్రకి స్వయాన మేనమామ. ఆయన ఒక్కగానొక్క గారాల కూతురు సరోజ.

సరోజ పుట్టినపుడు ఎర్రగా నెత్తురు కక్కుతూ గులాబి మొగ్గలా అందంగా వుండేది. అందుకే అంతా – "రోజా...రోజా పువ్వులా వుంది" అన్నారు క్రమంగా ఆ పేరే స్థిరపడింది.

కాంతివంత మైన ఆమె గులాబి రంగు శరీరచ్ఛాయ, సొగలు దేరిన కళ్ళు..... ఒంపు తిరిగిన సన్నని పెదవులు, చెయ్యి తిరిగిన చిత్ర కారుడు తీర్చి దిద్దిన బొమ్మలా వుంటుంది సరోజ.

చిదిమి దీపం పెట్టవచ్చు అనేటంతటి అందం ఆమెది

దానికి తోడు జగన్నాథం పెద్ద మోతుబరి రైతు సరోజ ఒక్కగనొక్క బిడ్డ కావటంతో అపురూపమైన పెంపకం.

రోజా పుట్టగానే "రవీన్" కి భార్య పుట్టింది అన్నారు.

ఆ అనుబంధం తోనే ఇన్నాళ్ళూ పెరిగారు.

సరిగ్గా రెండు నెల్ల క్రితమే రవీంద్ర తల్లి తండ్రులు వచ్చి సరోజకి–పూలు పళ్ళు ఇచ్చి ప్రధానం జరిపించారు

ప్రస్తుతం రవీంద్ర మెడిసన్ ఆఖరి సంవత్సరం లోకి వచ్చాడు

అతని పరీక్షలు పూర్తి కాగానే వచ్చే వేసవిలో ఇద్దరికి పెళ్ళి ముహూర్తం పెట్టి లగ్న పత్రిక కూడా వేశారు.

రోజా బి. ఎస్సి ఆఖరి సంవత్సరంలోకి వచ్చింది.

రవీంద్ర కాలేజికి టర్మ్ హాలిడేస్ ఇచ్చినప్పుడల్లా ముందు మేనమామ ఇంటికి వెళ్ళి రోజాతో నాల్గు రోజులు సరదాగా గడిపి ఆ తరువాతే తమ వూరికి వెళతాడు

ఇద్దరూ తరచూ ఉత్తరాలు రాసుకుంటారు.

కేవలం పెద్దలు కుదిర్చారనే కాక ఇద్దరికి ఒకరిపై ఒకరికి వల్ల మాలిన మమకారం. అలివికాని ప్రేమ. బావా–మరదళ్ళ తియ్యని అనుబంధం.

రవీంద్రకి ఆమె వూహే ఒక అందమైన అనుభూతి.

ఆమె తలపులే వెన్నెల జల్లులు.

ఆమె సమక్షంలో మల్లెపూల పరిమళంలా ఒక మత్తు ఆవరిస్తుంది అతన్ని.

....."ఏల సలిలంబు పారు గాడ్పేల విసరు?
ఏల నా హృదయమ్ము ప్రేమించా నిన్ను?–".....

అన్నంత సహజంగానూ ఇద్దరి హృదయాలూ ఏకమయ్యాయి.

పరీక్షలు అయ్యేదాకా వెళ్ళటం కుదరదని క్రిందటి నెల్లోనే ఏవో నాల్గు రోజులు సెలవులు కల్సివస్తే మేనమామ ఊరికి వెళ్ళి సరోజని చూసి వచ్చాడు రవీంద్ర

సరిగ్గా ఇంకొక వారం రోజుల్లో రవీంద్రకి ఆఖరి సంవత్సరపు మెడిసన్ పరీక్షలు మొదలవుతాయి.

ఆ సంగతి జగన్నాథం కి తెలియని విషయం కాదు.

అయినా.......

వెంటనే బయలు దేరి రమ్మని టెలిగ్రాం ఇచ్చాడంటే నిజంగానే సరోజకి సీరియస్‌గా వుండి వుండాలి. ఏదో ప్రమాదం జరిగి వుండాలి.

రవీంద్ర మనసు మనసులోలేదు.

ఎందుకో "కీడు" శంకిస్తుంది.

కడుపంతా నిప్పు రాజుతున్నట్లు వుంది.

రోజా!

తన మనసులో మనసు.

ప్రాణంలో ప్రాణం......

అలాంటి తన రోజాకి ప్రమాదంగా వుందంటే ఎంత పరీక్షలు అయితే మాత్రం తను వెళ్ళకుండా వుండగలడా? రోజా కంటే ఈ లోకంలో తనకి ఏదీ ఎక్కువ కాదు. అన్నీ ఆమె తరువాతే. రోజా దగ్గర్నించి ఉత్తరం రావటం ఒక్క రోజు ఆలస్యం అయితే చాలు...... తన మనసు పుస్తకం మీద లగ్నం కాదు.

"ప్రేమ" అన్న అందమైన పదానికి తన గుండెలో అర్థం స్ఫురింప చేసింది రోజాయే కదా?

వెన్నెల లోని చల్లదనం, కోయిల పాటలోని తియ్యదనం...... తనకి రోజా సాన్నిహిత్యం లోనే లభించాయి.

అలాంటి తన రోజాకి ఏమయ్యింది?

ఆలోచన్ల మధ్య సతమత మవుతూ అలసటగా కళ్ళు మూసుకున్నాడు రవీంద్ర.

అలా.... ఎంత సేపున్నాడో అతనికి తెలియదు.

ప్రయాణీకుల హడావుడి, కండక్టర్ కేకలకి , "కూలీ...... కూలీ..... " అన్న అరుపులకి గభాల్న మెలకువ వచ్చి కళ్ళు తెరిచాడు.

బస్సు గమ్యాన్ని చేరింది.

వేగు చుక్క పొడిచింది.

తూరుపు క్రమంగా తెల్ల బారుతోంది. రవీంద్ర బ్రీఫ్ కేస్ పట్టుకుని హడావుడిగా బస్సు దిగాడు.

* * * * * *

రవీంద్ర వెళ్ళేసరికి మేనమామ జగన్నాథం వీధి వసారాలో మంచంలో కూర్చుని చుట్ట తాగుతున్నాడు.

వసారాలో చిన్న లైటు వెలుగుతూంది.

లోపల వంట గదిలోనుంచి గిన్నెల శబ్దం వాటితోపాటే కమ్మటి కాఫీ డికాషన్ సువాసనలు వస్తున్నాయ్.

చేతిలో చిన్న సూట్‌కేస్‌తో లోపలికి వస్తున్న రవీంద్రని చూసి జగన్నాథం గభాల్న మంచం దిగి పెద్దలైటు వేశాడు.

మేనల్లుడ్ని చూడగానే ఒక్కక్షణం ఆనందమో దుఃఖమో తెలియని ఉద్వేగంతో కదిలినట్లయ్యాడు.

ఆయన మొఖంలో నెత్తురు విరిగింది.

ఇంక రవీంద్ర ఆతృత పట్టలేక పొయ్యాడు.

చేతిలో బ్రీఫ్‌కేస్ కిందపెట్టి చుట్టూ కలయ చూస్తూ ఖంగారుగా అడిగాడు.

"మావయ్యా? రోజా ఎక్కడ? ఆమెకేమయింది?"

అంతే!

తరతరాలుగ గెడ్డకట్టిన హిమాలయం కరిగి నీరయినట్లు ఆ చిన్న పరామర్శకే దుఃఖంతో కదిలి పొయ్యాడు జగన్నాథం.

కళ్ళనిండా ఎర్ర జీరలు అలుముకున్నాయి. దుఃఖాన్ని ఆపుకుంటున్నట్లు ఆయన దవడ ఎముకలు బిగుసుకున్నాయి.

గభాల్న నోట్లో చుట్ట గిరాటేసి రెండు చేతుల్తోటి రవీంద్రని గట్టిగా కౌగలించుకున్నాడు.

ఆయన కళ్ళనుండి వెచ్చటి కన్నీరు జలజలా రాలిపోతూంది.

భుజంమీది తువ్వాలుతో కళ్ళు తుడుచుకొని రుద్ధకంఠంతో అన్నాడు.

"ఏం చెప్పమంటావ్ రవీ! ముందు నువ్వు ఇలా కూర్చో...." అంటూ మేనల్లుడి చెయ్యిపట్టుకుని మంచంమీద కూర్చోపెట్టాడు.

ఇంతలో వసారాలో అలికిడికి వంటగదిలోంచి ఇవతలికి వచ్చిన తులసమ్మ మేనల్లుడు రవీంద్రని చూస్తూనే కొద్ది క్షణాలు నోటమాట పడిపోయినట్లు స్థంభించి పోయింది.

రవీంద్ర అయోమయంగా చూశాడు.

"అత్తయ్యా! రోజా ఎక్కడ? అసలు ఆమె కేమయింది? నన్నింత అర్జంటుగా ఎందుకు రమ్మన్నారు?"

"అంతే!

వ్రేళ్ళతో సహా పెకిలించబడ్డ మహా వృక్షంలా నిలువునా కుప్పకూలిపోయింది తులసమ్మ దుఃఖంతో కదిలిపోతూ చప్పున పయిట చెంగుతో ముఖం దాచుకుంది.

మేనత్త ప్రవర్తనతో స్థంభీ భూతుడయ్యాడు రవీంద్ర.

అతను ఎప్పుడు వచ్చినా రోజా చిరునవ్వుతో గడపలోనే ఎదురయ్యేది.

ముందుగా తెలిస్తే తండ్రిని తీసుకుని సరాసరి బస్సుస్టాండ్‌కే వచ్చేది.

కాని ఈ రోజు అతను వచ్చి పది నిముషాలు అవుతున్నా ఆమె కనిపించలేదు. సరికదా.... అసలు విషయం చెప్పకుండా ఈ ఏడుపులు ఏమిటి? ఇంతకీ రోజా ఎక్కడ?

కోపంగా నొసలు చిట్లించి ఏదో అనబోయి-మళ్ళీ అంతలోనే చివ్వున మంచం లోంచి లేచి నడవ దాటి చరచరా ఆమె గది వైపు వెళ్ళబోయ్యాడు.

అతని పరిస్థితి అయోమయంగా వుంది.

క్షణక్షణానికి అతనిలో సహనం నశించిపోతూంది. క్రోధంతో రవీంద్ర నాలుగు అడుగులు వేశాడో లేదో ...జగన్నాథం ఖంగు తిన్నవాడిలా గభాల్న లేచి మేనల్లుడ్ని అడ్డకొని చప్పున అతని చేతిని పట్టుకున్నాడు. వారిస్తున్నట్లుగా అన్నాడు.

"నాయనా రవీ! రోజా కిప్పుడు బాగానే వుంది. నిద్ర పోతూంది. కాని ముందు నీతో అర్జంటుగా కొంచెం మాట్లాడాలి. ఆతరువాత రోజాని చూద్దువు గాని...."

అంటూ మరో మాటకి ఆస్కారం లేకుండా రవీంద్ర చేతిని గట్టిగా పట్టుకొని గబగబా హాలు దాటించి పెరటి వైపుకి తీసుకెళ్ళాడు.

పెరటంతా రకరకాల పూల మొక్కలతో బాగా ఏపుగా పెరిగి నవనవ లాడుతూంది.

తెల్లవారు ఝాము... సమయం ఐదు గంటలు కావస్తోంది. ఇంకా పూర్తిగా వెలుగు రేఖలు విచ్చుకోలేదు.



"పుష్ప విలాపం"

ప్రకృతి అంత పల్చగా తెరకప్పినట్టు పొగ ఆవరించింది.

పక్షులు గూళ్ళలోంచి బయటికి వచ్చి కలకల రావాలు చేస్తూ సుప్రభాతం పలుకుతున్నాయి.

జగన్నాధం రవీంద్ర చేయి పట్టుకొని నూతి గట్టు దగ్గరకి తీసుకెళ్ళాడు.

రవీంద్ర భుజాలు పట్టుకొని ప్రక్కనే వున్న గట్టు మీద కూర్చో పెడుతూ తనూ కూర్చున్నాడు.

"............"

"............"

కొద్ది క్షణాలు ఇద్దరి మధ్య నిశ్శబ్దం. ఆ తరువాత జగన్నాధం నెమ్మదిగా గొంతు విప్పాడు.

"నాయనా! రవీ..... ఇప్పుడు సరోజ ఆరోగ్యం బాగానే వుంది. ప్రమాదం లేదని డాక్టర్లు చెప్పారు. మా ఖర్మమో... దాని దురదృష్టమో... జరగకూడని అనర్థం జరిగిపోయింది. ముందు నేను చెప్పేది ప్రశాంతంగా విను. ఆ తరవాత నీకేది మంచిదని తోస్తే అది చెయ్యి...."

"..............!?"

"మొన్న రాత్రి రోజా దాని స్నేహితురాళ్ళతో కల్సి మొదటి ఆట సినిమాకి వెళ్ళింది. సినిమా వదిలే సమయానికి బాగా వర్షం పడేటట్టు వుండటంతో బస్సు కోసం నిల్చోక రోజా స్నేహితురాళ్ళంతా ఆటోలు రిక్షాలు మాట్లాడుకొని ఇళ్ళకి వెళ్ళిపోయారట. అందుకని రోజా కూడా ఆటో మాట్లాడుకొని ఎక్కి కూర్చుంది. అయితే సగం దారిని వచ్చేసరికి ఎవరో కొందరు రౌడీలు ఆటోని అటకాయించి దౌర్జన్యంగా పక్కదారి పట్టించి ఊరి చివరికి తీసుకు వెళ్ళారట. అక్కడ ....వాళ్ళంతా కల్సి ....నీనా....రోజా....ని......."

"ఆఁ.........!?"

పిడుగు పడినట్టు అదిరి పడ్డాడు రవీంద్ర వెర్రివాడిలా మేనమామ మొఖంలోకి చూశాడు.

"............"

"............"

కొద్ది నిమిషాలు ఇద్దరి మధ్య నిశ్శబ్దం.

జగన్నాధంపై తువ్వాలుతో కళ్ళు తుడుచుకుని రాద్ధమైన గొంతు సవరించుకున్నాడు.

"అవును రవీ! ఆ రౌడీలు కత్తులు కటార్లతో ఆటో డ్రైవర్ని, రోజాని బెదిరించారుట. ఆ ఆటో డ్రైవరు వాళ్ళ చేత బాగా దెబ్బలు తిని స్పృహ తప్పాడు. ఇంకా హాస్పటల్ లోనే వున్నాడు.

..... అసలు రోజా మొదటి ఆట సినిమాకి బయలు దేరు తున్నప్పుడే నేనూ మీ అత్తయ్యా కూడా వద్దని వారించాము. కారణం అప్పటికీ వారం రోజులుగా ఊళ్ళో బాగుండ లేదు. మతపరంగా అల్లర్లు జరిగి పాతబస్తీ అంతా అట్టుడికినట్టు వుడుకు తోంది. దాంతో రాజకీయంగా కూడా గొడవలు మొదలయినాయి. కొన్ని ప్రాంతాల్లో "కర్ఫ్యూ" కూడా విధించారు. కాని ఇటువైపు గొడవలు ఏమీ లేవు. అంతా ప్రశాంతంగానే వుంది. అయినా ఊళ్ళో బాగోనప్పుడు ఈ పరిస్థితుల్లో సినిమా ఏమిటని వారించాము. కాని అప్పటికే పదిరోజుల్నుంచి కాలేజీలకి "టర్మ్ హాలిడేస్..... అందువల్ల వీళ్ళంతా ఏం తోచక ఓ అరడజను మంది అమ్మాయిలు మనింటికి వచ్చారు. "బోర్"గా వుందని అంతా కల్సి మొదటి ఆట సినిమాకి బయలు దేరారు. సరే ఒకళ్ళకి ఒకళ్ళు తోడుగా వున్నారు కదా అని మేమూ గట్టిగా కాదన లేక పొయ్యాం . అదే మేం చేసిన పొరపాటు. ....

..... వెళ్ళేటప్పుడు అంతాకల్సి వెళ్ళినా వచ్చేటప్పుడు రాత్రి సమయం , పైగా వర్షం పడేటట్టు వుండటంతో – ఎవరి దారిన వాళ్ళు ఇళ్ళకి వెళ్ళి పొయ్యారు. మిగతా అమ్మాయిలంతా క్షేమంగానే ఇళ్ళకి చేరారు. కాని మా ఖర్మ కాలి మన సరోజ విషయం లోనే ఇలా విధి వక్రించింది పైగా మనది కాస్త వూరికి దూరంగా వున్న కాలనీ ఏరియా..... దాంతో ...."

"....... ! ?" రవీంద్ర వూపిరి తియ్యటం కూడా మరిచి పొయ్యాడు.

మెదడు నరాలు చిట్లి శరీరం లోని రక్తం అంతా గెడ్డ కడుతున్నట్టు చైతన్య రహితం అయి పొయ్యాడు. భావరహిత మైన గాజు కళ్ళతో వెర్రి వాడిలా మేనమామ ముఖం లోకి చూస్తూ వుండి పొయ్యాడు.

వింటున్నది నిజమో అబద్ధమో తెలియని సందిగ్ధంలో స్థాణువు అయిపొయ్యాడు.

"ఆరోజ రాత్రి ..... సినిమాకని వెళ్ళిన పిల్ల ఎంతకి రాకపొయ్యే సరికి మీ అత్తయ్య ఏడుపు లంకించు కుంది. దాని ఏడుపు చూస్తే నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు.

ఆఖరికి ఆ వానలోనే గొడుగు వేసుకుని దాని స్నేహితురాళ్ళందరి ఇళ్ళు గాలించాను. చివరికి గత్యంతరం లేక పోలీసు కంప్లెంటు ఇచ్చాను. రిపోర్టు ఇచ్చిన రెండు గంటలకి ఆ చూకి దొరికింది......

..... ఊరి చివర తుప్పల్లో పులివాత పడ్డ జింకలా చావు బతుకుల్లో వున్న రోజాని అక్కడికి కాస్త దూరంలో తల పగిలి రక్తం మడుగులో వున్న ఆటో డ్రైవర్ని పోలీసులు చూసి హాస్పటల్లో చేర్చారు. నిన్న రాత్రి రోజాని ఇంటికి తీసుకొచ్చాం....."

"మామయ్యా ! ?"

"అవును రవీ జరిగింది ఇది. దాని బతుకు బండలు అయిపోయింది. ఊళ్ళో తల ఎత్తుకో లేక ఓ ప్రక్క, ఒక్కగా నొక్క కూతురి బతుకు బురదపాలయిందన్న బాధ మరొక ప్రక్క........!

.... రోజా కన్నీరు చూడ లేక పోతున్నాం. ప్రాణాలతో బయట పడింది. కాని ఏం లాభం ? నా కన్న తల్లి ఎవరికి అన్యాయం చేసిందని దానికింత శిక్ష? నువ్వు ఇంక దాని ముఖం చూడనని నువ్వు లేకుండా తను బ్రతక లేనని దాని బాధ. నిన్న రాత్రి ఒంటినిండా కిరసనాయిల్ పోసుకుంది. ఒక్క క్షణం ఆలస్యం అయితే మాకు బూడిదే మిగిలేది. ఎంత బ్రతిమాలిన పచ్చి గంగ కూడా ముట్టటం లేదు.....

"అసలు విషయం నీకు నెమ్మదిగా ఉత్తరం వ్రాద్దామనుకున్నాను. కాని....దాని బాధ చూడలేక ఏమైనా జరగనీ అనుకుని నీకు టెలిగ్రాం ఇచ్చాను. ఏ క్షణంలో ఏం అఘాయిత్యం చేస్తుందో నని నేను మీ అత్తయ్య వెయ్యి కళ్ళతో కాపాడుతున్నాం. ఏ జన్మలో ఏం పాపం చేసుకున్నామో....ఈ రోజు ఇంత శాపం పెట్టాడు మాకు ఆ భగవంతుడు......"

జీరబోయిన కంఠంతో చెప్పటం ఆపి దీర్ఘంగా వూపిరి తీసుకున్నాడు జగన్నాధం.భుజం మీది తువ్వాలుతో అలసటగా మొఖం తుడుచుకున్నాడు.

"............"

రవీంద్రలో చలనం నశించి పోయింది. గుండెని ఒక్కసారి బయటికి తీసి తిరిగి యధాస్థానంలో పెట్టినట్టు కొద్ది క్షణాలు అతని మస్తిష్కం స్థంభించి పోయింది.

మేనమామ చెప్పున్న విషయాలు వింటూ స్తంభీభూతుడయి పొయ్యాడు.

చివరికి ఎలాగో గొంతు పెగల్చుకొని నాలికతో పెదాలు తడుపుకున్నాడు. ఏదో చెప్పాలన్న తాపత్రయంతో పెదవి కదిపాడు.

అంతలో మళ్ళి జగన్నాధమే అన్నాడు.

"నాయనా రవీన్! ఈ పరిస్థితుల్లో నీకు నేను ఏది చెప్పలేను. నువ్వు చదువుకున్న వాడివి. మంచి-చెడు అన్ని ఆలోచించగలవు. రోజా దాని గదిలో వుంది. నీకు ఇష్టం అయితే వెళ్ళి చూడు. లేకపోతే ఇట్నుంచి ఇటే వెళ్ళిపో. దాని మొఖాన ఏది రాసి వుంటే అదే జరుగుతుంది."

"మావయ్యా?"

"అవును రవీన్!" ఇంతకంటె నీకు నేను ఏమీ చెప్పలేను. ఏదీ దాచకుండా జరిగింది జరిగినట్టు నీకు చెప్పాను. రోజా విషయంలో నీ నిర్ణయం ఎలాంటి దయినా నాకు సంతోషమే." నోటి వాక్యం పూర్తి కాకుండానే జగన్నాధం గభాల్న లేచి మొఖం చాటు చేసుకుని వడి వడిగా వీధిలోకి వెళ్ళిపొయ్యాడు.

రవీంద్ర దిగ్భ్రాంతుడయ్యాడు.

ఆ తెల్లవార ఝామున.... చీకట్లు విడని ఆ తొలి వేకువలో .... ఆ చల్లని ... మంచులో.... ఒంటరిగా మిగిలిపొయ్యాడు .

ఎంతో సేపు అలాగే చలనం లేని రాతి బొమ్మలా కూర్చుండి పొయ్యాడు. అతని మనసంతా భావరహితం అయిపోయింది – "న – భంసురి

న – భాంసురియా" – అన్నట్టు మనసు మూగబోయింది.

చుట్టూ మంచు పొరలు పొరలుగ ప్రకృతిని ఆవరించుకొని వుంది.

ప్రక్కనే బావి గట్టును అనుకొని పెద్ద దేవపారిజాతం చెట్టు ఆకు కనిపించకుండా నిలువెల్లా పూలతో విరగబూసింది.

ఆ చెట్టు కిందంతా పారిజాతం పూలు రాసులు పోసినట్టు గుట్టలు గుట్టలుగ పడి వున్నాయ్.

గాలి వీచినప్పుడల్లా ఆ చెట్టు నుంచి పూలు

జలజలా రాలిపడుతున్నాయి.

ఆ పూల నుంచి వచ్చే మత్తైన పరిమళం సన్నగా గాలిలో కదులుతూంది.

చిన్నటి ఎర్ర కాడలో.... పవిత్రంగా ... వున్న ఆ తెల్లని పూలు...... మంచు ముత్యాలతో పోటి పడుతున్నాయ్.

ఆ రాలిన పూలని చూస్తుంటే రవీంద్రకి చప్పున మెరుపులా ఒక సంఘటన జ్ఞాపకం వచ్చింది.

సరోజ ఉదయానే లేచి ఆ రాలిన పూలన్నింటిని ఏరి పెద్ద దండ కట్టి దేవుడి పటానికి వేసేది.

దాంతో తులసమ్మ గయ్యి మనేది. "చెట్టున అన్ని పూలుండగా ఆ కింద పడ్డ పూలు దండ కడతా వేమిటే?" అని కూతుర్ని తిట్టుకొనేది.

అయినా రోజా పంతంగా ఆ కింద రాలిన పూతే దండ గుచ్చి దేముడి పటానికి వేసేది రోజా

రవీంద్రకి కూడా అలా కింద పడ్డ పూలు దేముడికి అలంకరించటం నచ్చేది కాదు.

అందుకే –

"పోనీ అత్తయ్య చెప్పినట్టే వినరాదా రోజా?" అనేవాడు రవీంద్ర.

"ఎందుకు వినాలి బావా?" ఈ పూలు ఏం పాపం చేశాయని? కింద పడ్డాయని ఈ పూలని మనం నిర్లక్ష్యంగా ఇలాగే వదిలేశామనుకో. పనిమనిషి వచ్చి చీపురుతో చెత్త కుప్ప మీదకి వూడ్చేస్తుంది. కింద రాలినంత మాత్రాన పూజకి ఎందుకు పనికి రావూ? అంతా మన భ్రమ. మంచి అయినా చెడు అయినా మనం అనుకోవటంలో వుంది...

....చూడు. మంచులో తడిసి తెల్లగా ఎంత అందంగా వున్నాయో! కింద పడ్డంత మాత్రాన పూజకి పనికి రావా? ఎవరా మాట అన్నది?"

...అంటు ఎంతో భక్తిగా ఆ చెట్టు కింద నేల మీద రాలిపడ్డ పూలన్నింటిని ఒద్దికగా ఏరి బుట్టలో వేసి చక్కగా నీళ్ళలో కడిగేది రోజా. ఓపిగ్గా దండ గుచ్చి భక్తిగా దేముడి పటానికి అలంకరించేది.

ఆ మాటలన్ని ఇప్పుడు రవీంద్ర మనసులో గంట కొట్టినట్టు వినిపిస్తున్నాయి.

ఎదురుగా వున్న ఆ పారిజాతం చెట్టు నుంచి గాలి విసిరి నప్పుడల్లా జలజలా పూలు రాలిపడుతుంటే... అంచెలంచెలుగా...రోజా మాటలు... ఆ నాటి దృశ్యాలు జ్ఞాపకం వస్తున్నాయి.

చిన్న ఎర్రటి కాడలో తెల్లగా మంచుపుష్పాల్లా వున్న ఆ పారిజాతం పూలని చూస్తుంటే నిర్మలమైన ...అమాయకమైన ....సరోజ ముగ్ధ మోహన రూపమే కనిపిస్తుంది.

"ఈ పూలు పూజక పనిక రావా? ఎవరా మాట అన్నది?" అని నిలదీసి ప్రశ్నిస్తున్నట్టే అనిపిస్తూంది. రవీంద్ర మనసు మెత్తగా కరిగినట్టు అయ్యింది.

చప్పున బావి గట్టు మీంచి లేచి ఆ పూల చెట్టు దగ్గరకి వెళ్ళాడు.

ఒంగి గుట్టలు గుట్టలుగా నేల మీద రాసులు పోసినట్టు రాలిపడి వున్న ఆ చిన్న తెల్లటి పారిజాతం పూలని దోసిలి నిండా తీసుకున్నాడు.

సరిగ్గా అదే సమయంలో –

సందు చివర వున్న శివాలయంలో తెల్లవారు ఝాము ....సుప్రభాత సేవని సూచిస్తూ...

"ఠంగ్ ...ఠంగ్..." మని గంటలు మ్రోగాయి.

ఆ గంటలతో పాటే మైకులో సుప్రభాత గీతం శ్రావ్యంగా మొదలయ్యింది.

".....

ఏమి చేతురా లింగా
ఏమి చేతూ...
గంగ ఉదకము తెచ్చి నీకు
లింగ పూజలు చేదమంటే
గంగనున్న చేప-కప్ప
ఎంగిలంటున్నాయి లింగా
మహానుభావా...
మా లింగమూర్తి
ఏమి చేతురా....."

ఆ ఉషోదయాన ...మంచు తెరలని చీల్చుకుని శ్రావ్యంగా మారుమ్రోగుతుంటే –

ప్రతి పువ్వులోనూ సరోజ చిరునవ్వుతో కూడిన అమాయకమైన ముగ్ధ మోహన రూపమే కదులుతుంటే దోసిలి నిండా పూలని పట్టుకుని నెమ్మదిగా ఆమె గది వైపు అడుగులు వేశాడు రవీంద్ర. □

ఇ·వేమన·పద్యాలు

కొండగుహలనున్న కోవెలలందున్న
మెండుగాను బూది మెత్తియున్న
కుండుగోకు బుద్ధి కుదరక మానదు
విశ్వదాభిరామ వినురవేమ.